ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

ఆదివారం 28 జూలై 2024





ఎడతెరిపిలేని వర్షం

- మిడ్ మానేరు ప్రాజెక్ట్‌కు గోదావరి జలాలు
- ఎల్లంపల్లి వద్ద మొదలైన ఎత్తిపోతలు
- జిల్లాలో సాధారణ వర్షపాతం 333.6 మిల్లీమీటర్లు
- 414.6 మిల్లీమీటర్ల వర్షం నమోదు
- చెరువులు, కుంటల్లోకి చేరుతున్న వరదనీరు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో నేలమ్మ తడిసి ముద్దయ్యింది. సీజన్ ప్రారంభంలో నైరుతి రుతుపవనాలు నిరాశ పర్చినా వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని చెరువులు, కుంటల్లోకి వరదనీరు చేరుతోంది. ఒర్రెలు, వాగుల్లో వరదనీరు పారుతోంది. శనివారం జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా ముసురుతో కూడిన వర్షం పడింది. 5.1 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి 14.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని రుద్రంగిలో 21.2 మిల్లీమీటర్లు, చందుర్తి 18.0, వేములవాడ రూరల్ 15.9, బోయినపల్లి 17.6, వేములవాడ 16.4, సిరిసిల్ల 15.6, కోనరావుపేట 16.2, వీర్నపల్లి 16.2, ఎల్లారెడ్డిపేట 12.0, గంభీరావుపేట 8.4, ముస్తాబాద్ 9.3, తంగళ్లపల్లి 11.7, ఇల్లంతకుంటలో 9.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని ఎగువ మానేరు ప్రాజెక్ట్‌లోకి 30 క్యూసెక్కుల వరదనీరు చేరుతోంది. అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లోకి 20 క్యూసెక్కులు, మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లోకి 293 క్యూసెక్కుల వరదనీరు చేరుతోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జిల్లాలోని వాతావరణం ఒక్కసారిగా చల్లబడి ప్రజలకు ఎంతో ఊరటనిస్తే పంటలు దక్కు తాయని రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది. జిల్లాలో ఈ వర్షా కాలం సీజన్‌లో శనివారం వరకు 333.6 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి 414.6 మిల్లీమీటర్లు నమోదైంది. జిల్లాలోని 13 మండలాలు ఉండగా ఎనిమిది మండలాల్లో అధిక వర్షం, ఆరు మండలాల్లో సాధారణ వర్షం కురిసింది. చందుర్తిలో అత్యధిక వర్షపాతం నమోదైంది.

● మిడ్‌మానేరుకు గోదావరి జలాలు

కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి గుండె కాయగా మారిన జిల్లాలోని శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లో నీళ్లు అడుగంటి వెలవెల బోతున్న క్రమంలో మళ్లీ గోదావరి జలాలతో జలకళను సంతరించు కోనుంది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని మేడిగడ్డ బ్యారేజ్‌లో ఏర్పడిన లోపాలతో సిరిసిల్ల మిడ్ మానేరులోకి నీటి ఎత్తిపోత నిలిచిపోయింది. ప్రస్తుతం 27.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లో 5.86 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉంది. గత సంవత్సరం ఈ సమయానికి 17.14 టీఎంసీల నీరు ఉంది. కాళేశ్వరం జలాలు ఎత్తిపోసే పరిస్థితి లేకపోవడంతో ప్రభుత్వం శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి గోదావరి జలాలను తరలిస్తోంది. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ గేట్లు ఎత్తకుండా నంది మేడారం, నంది పంప్‌హౌస్ నుంచి లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి మిడ్ మానేరులోకి నీటిని తరలించే ప్రక్రియ మొదలు పెట్టింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లోకి 293 క్యూసెక్కుల వరదనీరు మానేరు, మూల వాగుల నుంచి వచ్చి చేరుతోంది. మిడ్ మానేరు ప్రాజెక్ట్ నుంచి ఎల్ఎండీ, రంగనాయకసాగర్, కొండపోచమ్మ, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎగువ మానేరు ప్రాజెక్ట్‌లకు నీటిని వదిలే అవకాశం ఉంది. జిల్లాలోని అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లో 3.50 టీఎంసీలకు 0.75 టీఎంసీల నీరు ఉంది. మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లోకి నీటిని నింపడం ద్వారా బ్యాక్ వాటర్‌తో వేములవాడ, సిరిసిల్ల మానేరు వాగులో దాదాపు 18 కిలోమీటర్ల మేరకు నీటి నిల్వలు చేరి భూగర్భ జలాలు పెరగనున్నాయి.

జిల్లాలో కురిసిన వర్షపాతం వివరాలు (మిల్లీమీటర్లలో)

మండలం	సాధారణం	కురిసిన వర్షం
రుద్రంగి	379.7	421.4
చందుర్తి	378.0	645.7
వేములవాడ రూరల్	374.5	424.9
బోయినపల్లి	312.6	403.1
వేములవాడ	372.1	505.1
సిరిసిల్ల	350.3	451.0
కోనరావుపేట	316.3	333.03
వీర్నపల్లి	331.0	371.5
ఎల్లారెడ్డిపేట	321.6	334.6
గంభీరావుపేట	305.1	268.3
ముస్తాబాద్	271.6	364.3
తంగళ్లపల్లి	354.8	476.3
ఇల్లంతకుంట	269.3	290.4
సరాసరి	333.6	414.6

● 90,286 ఎకరాల్లో సాగు

వర్షాభావ పరిస్థితులతో ఆలస్యంగా ప్రారంభమైన వానాకాలం సాగు అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వానలకం ఊపందుకుంది. 2.42 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు అంచనా వేయగా ఇప్పటి వరకు 90 వేల 286 ఎకరాల్లో పంటలు వేశారు. జిల్లాలో వరి, పత్తి సాగు ప్రధాన పంటలుగా ఉన్నాయి. వరి 1.83 లక్షల ఎకరాలకు 41,904 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. పత్తి 49,215 ఎకరాలకు 46,493 ఎకరాల్లో విత్తనాలు వేశారు. ఇతర పంటల్లో 877 ఎకరాల మొక్కజొన్న, 823 ఎకరాల్లో కందులు, 46 ఎకరాల్లో పెసర. 143 ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేశారు.



మిడ్ మానేరు ప్రాజెక్ట్ (ఫైల్)



గాయత్రి పంప్ హౌస్ నుంచి విడుదలవుతున్న నీరు

మిడ్ మానేరుకు గోదావరి జలాలు

- శ్రీపాద ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతలు షురూ..
- నంది పంప్ హౌస్‌కు 12,600 క్యూసెక్కుల నీటి తరలింపు
- ప్రభుత్వ ఆదేశాలతో నంది, గాయత్రి పంప్‌హౌస్‌లలో మోటార్లు ఆన్ చేసిన అధికారులు

ఎదురు చూపులకు తెరపడింది. వర్షాలు లేక వెలవెలబోతున్న రిజర్వాయర్లను చూసి ఆందోళన చెందుతున్న రైతులకు ఉపశమనం లభించనుంది. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్టు నీటి మట్టం శనివారం 17.396 టీఎంసీలకు చేరుకుంది. దీంతో నీటిని నంది పంప్‌హౌస్‌కు తరలించారు. అక్కడ నాలుగు మోటార్లు ఆన్ చేసి 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోశారు. సాయంత్రం వరకు ఆ నీరు గాయత్రి పంప్‌హౌస్‌కు చేరడంతో అక్కడ నాలుగు మోటార్లు ఆన్‌చేసి మిడ్‌మానేరుకు తరలించారు. ఆ నీరు రాత్రి వరకు మిడ్‌మానేరుకు చేరాయి. ఈ యేడు సాగునీరు అందుతాయో లేదోనని ఆందోళన చెందిన రైతులు నీటి విడుదలతో ఊపిరి పీల్చుకున్నారు.

7లో..

సినారె పుస్తకావిష్కరణకు సీఎంకు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూలై 27: జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణ రెడ్డి 93వ జయంతి సందర్భంగా ఆవిష్కరించనున్న 'సమన్వితం' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆహ్వానించారు. శనివారం హైదరాబాద్‌లో ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ నెల 29వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట సుశీల నారాయణరెడ్డి ట్రస్ట్ సభ్యులు ఉన్నారు.

చండీ యాగానికి రావాలని బండి సంజయ్‌కి ఆహ్వానం



బండి సంజయ్‌కి ఆహ్వాన పత్రం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, జూలై 27: సిరిసిల్ల పట్టణంలోని మార్కండేయ స్వామి దేవాలయం ఆవరణలో నిర్వహించనున్న చండీ మహాయాగానికి రావాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను శనివారం సిరిసిల్ల పద్మశాలి సంఘం నాయకులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, కార్యదర్శి మండల సత్యం, ఉపాధ్యక్షులు మోర రవి, గాజుల బాలయ్య, గుండ్లపల్లి శ్రీనివాస్, గుజ్జె తార, గుండపల్లి పూర్ణచందర్, బీజేపీ నాయకులు అన్నల్‌దాస్ వేణు, పత్తిపాక పద్మ తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా గుంత.. రాకపోకలకు చింత

- అధ్వానంగా రోడ్డు - వాహనదారుల ఇబ్బందులు

ఇల్లంతకుంట, జూలై 27: రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరైనా పనులు మాత్రం పూర్తికాకపోవడంతో వాహనదారులు, మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇల్లంతకుంట నుంచి జిల్లా కేంద్రానికి వెల్జీపూర్ మీదుగా తక్కువ సమయంలో చేరుకోవచ్చు. స్థానిక నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో 2021లో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద రూ.4.50కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో బీటీ రోడ్డును నిర్మించాలని నిర్ణయించారు. వెల్జీపూర్ నుంచి పోచమ్మ ఆలయం వరకు మాత్రమే రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. వెల్జీపూర్ నుంచి రహీంఖాన్‌పేట, పోచమ్మ ఆలయం నుంచి తంగళ్లపల్లి వరకు పనులు పూర్తి కాలేదు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఎర్రనర్సపల్లె గ్రామం వద్ద కొనసాగుతున్న పనుల నేపథ్యంలో భారీ వాహనాలు వస్తుండంతో నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం మారిన అనంతరం ప్రాజెక్టు పనులు నిలిచిపోయినా రోడ్డు పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ప్రస్తుతం రోడ్డుపై అడుగుకో గుంత ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని, వెంటనే పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన వెల్జీపూర్ రోడ్డు

సీపీఆర్‌పై అవగాహన అవసరం



సీపీఆర్ విధానాన్ని వివరిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 27 : ప్రతీ ఒక్కరికి సీపీఆర్ శిక్షణపై అవగాహన అవసరమని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా రెనే హాస్పిటల్ కరీంనగర్, సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్తంగా శనివారం అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంతరావు, రెనే హాస్పిటల్ జనరల్ మేనేజర్ అరవింద్‌రావు, మార్కెటింగ్ మేనేజర్ ప్రసాద్, ప్రఫుల్, ప్రశాంత్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో హరితహారం



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

గంభీరావుపేట, జూలై 27: గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం హరిత హారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పీవో ధర్మపురి ఆధ్వర్యంలో హరితహారాన్ని నిర్వహించారు. మొక్కలు మానవ మనుగడకు దోహద పడతాయని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దాసు, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



తనిఖీ చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి):సీజనల్ వ్యాధులపై ఆసుపత్రికి వచ్చేవారికి అవగాహన కల్పించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులు, మందులు, పరీక్ష గదులు వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. ప్రసవాలపై అడిగి తెలుసుకున్నారు. 34 ప్రసవాల లక్ష్యానికి 24 పూర్తి చేసినట్లు డాక్టర్ కృష్ణవేణి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల్లో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు.

గిరిజన విద్యార్థినికి ఆర్థిక చేయూత

వీర్నపల్లి, జూలై 27: వీర్నపల్లి మండలం బావ్‌సింగ్ నాయక్ తండా పరిధిలోని గోన్యానాయక్ తండాకు చెందిన గిరిజన ఐఐటీ విద్యార్థిని బాదావత్ మధులతకు గిరిజన నాయకుడు లకావత్ వసంత్ నాయక్ రూ.5 వేలు అందజేశారు. పేద విద్యార్థులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

సృజనాత్మక రచన, శిల్పాశాలల నిర్వహణ హర్షణీయం

సిరిసిల్ల రూరల్, జూలై 27: విద్యార్థులకు రచనలతోపాటు అవ్వతాతలకు ఉత్తరం రాద్దాం రండి అనే కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని 30 పాఠశాలల్లో సృజనాత్మక రచన శిల్పాశాలలను నిర్వహించడం హర్షణీయమని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఎలగొండ రవి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం శిల్పాశాలలకు సంబంధించిన కరపత్రాలను ప్రధానోపాధ్యాయిని లోకిని శారద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎలగొండ రవి మాట్లాడుతూ సిరిసిల్లకు చెందిన బాలసాహితీవేత్త కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్ బాల సాహిత్య రజతోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని 30 పాఠశాలల్లో సృజనాత్మక రచన శిల్పాశాలల కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. కన్వీనర్‌లుగా గరిపెల్లి అశోక్, డాక్టర్ సిరిసిల్ల చందన, కో- కన్వీనర్‌లుగా అడెపులక్ష్మణ్, రవి వ్యవహరిస్తారన్నారు. ఉపాధ్యాయులు నరేందర్, సతీష్, బాబు, రాజలింగం, సురేష్, మంజుల, జయంతి పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

గొల్లపల్లి యువకుడికి డాక్టరేట్

ఎల్లారెడ్డిపేట, జూలై 27: ఆయుర్వేద రంగంలో చేస్తున్న సేవలను గుర్తించి ఏసీయా ఇంటర్‌నేషనల్ కల్చరల్ అకాడమీ తమిళనాడులో నిర్వహించిన కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన గుర్రాల విజయ్‌రెడ్డికి శనివారం డాక్టరేట్ అందజేసింది. విజయ్‌రెడ్డి కొంత కాలంగా ఆయుర్వేద రంగంలో విశేష కృషి చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన సంస్థ తమిళనాడులోని హోసూర్‌లో సంస్థ వ్యవస్థాపకుడు మాస్టర్ వి. బాబు విజయన్, మణికరణ్, కృష్ణగిరి సీఐ జ్ఞానశేఖర్ చేతుల మీదుగా పట్టాను అందజేశారు.

రాజధానిలో నేతన్నల పోరు

- ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేస్తున్న అఖిల పక్షం నాయకులు





ఐక్యతను చాటుతున్న వస్త్రోత్పత్తి అనుబంధ సంఘాల జేఏసీ నాయకులు, ధర్నాలో సిరిసిల్ల నేతన్నలు

సిరిసిల్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలని, విద్యుత్ సమస్యను పరిష్కరించాలని సిరిసిల్ల పవర్‌లూం వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో వారం రోజులుగా ఆందోళనలు చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆందోళనలు ఉధృతం చేశారు. శనివారం సిరిసిల్ల పవర్‌లూం వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల జేఏసీ హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ధర్నా నిర్వహించారు. సిరిసిల్ల నుంచి దాదాపు 500 మంది కార్మికులు, ఆసాములు, వస్త్రోత్పత్తిదారులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతరాములు, ఎమ్మెల్యే సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు, కూరపాటి రమేష్, వస్త్రోత్పత్తి దారుల ప్రతినిధులు తాటిపాముల దామోదర్, మంచె శ్రీనివాస్, గోవిందు రవి, దూడం శంకర్, అడెపు భాస్కర్, అంకారపు రవి, సిరిసిల్ల రవి, గడ్డం విఠల్, మోర రవి, మండల సత్యం, వీస్కు మధు, వెల్దండి దేవదాస్, బొద్దుల సుదర్శన్, పంతం రవి, మూషం రమేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారిపై కేసు

సిరిసిల్ల క్రైం, జూలై 27: సిరిసిల్ల నెహ్రూనగర్‌కు చెందిన దుబాల మొండయ్య అనే వడ్డీ వ్యాపారిపై శనివారం కేసు నమోదు చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇంటి పత్రాలు, ఖాళీ బాండ్ పేపర్లు తాకట్టు పెట్టుకొని మొండయ్య అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చినట్లు, కట్టనివారి ఆస్తులు అక్రమంగా స్వాధీన చేసుకుంటున్నట్లు ఫిర్యాదులు అందడంతో కేసు నమోదు చేశామని తెలిపారు. ఎవరైనా బాధితులు ఉంటేస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

నేటి నుంచి మావోయిస్టు అమరవీరుల

సంస్మరణ వారోత్సవాలు



మంథని, జూలై 27: భూమి కోసం.. భుక్తి కోసం.. పీడిత ప్రజల విముక్తి కోసం.. దశాబ్దాలుగా సాగుతున్న ప్రజా పోరులో నేలకొరిగిన మృత వీరులను స్మరించుకునేందుకు సీపీఐ మావోయిస్టు పార్టీ ఏటా జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహించుకుంటోంది. వారోత్సవాలు జరుపుకోవాలని మావోయిస్టు పార్టీ ఇప్పటికే పత్రికా ప్రకటనతో పిలుపునిచ్చింది. నక్సల్బరి-శ్రీకాకుళం పోరాటాల వారసత్వాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లా పునికి పుచ్చుకుంది. ఈ చైతన్య ఉద్యమ వారసత్వ కారణంగా మంథని, పెద్దపల్లి, రామగుండం, జగిత్యాల, సిరిసిల్ల, హుస్నాబాద్, హుజూరాబాద్, జమ్మికుంట, కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాల్లో దొరలు, భూస్వాములు, పటేల్, పట్వారీల అరాచకాలు, అణచివేతలపై ప్రజలంతా విప్లవోద్యమ చైతన్యంతో ప్రజలు దొరలు, దొరల గడీలపై దండయాత్రలు చేయడంతో పాటు జగిత్యాల జైత్రయాత్రతో పోరాటాల ఖిల్లా చరిత్రకెక్కింది. సీపీఐ మావోయిస్టు పార్టీకి సెంట్రల్ కమిటీ కార్యదర్శిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి దశాబ్దాల కాలంగా ప్రాతినిధ్యం వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా (ప్రస్తుత జగిత్యాల) బీర్‌పూర్ గణపతి స్వగ్రామం. గణపతి దళపతిగా పని చేసిన ఖిల్లా అయిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దాదాపు మూడున్నర దశాబ్దాలకుగా పైగా సాగుతున్న విప్లవోద్యమంలో వందల సంఖ్యలో వీరులు అమరలయ్యారు. నిరంతరం పోలీసుల దాడులు.. వరుస ఎన్‌కౌంటర్.. పెరిగిన ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్.. తగ్గిన రిక్రూట్‌మెంట్ల కారణంగా కొన్ని సంవత్సరాలుగా మావోయిస్టులు తమ కార్యకలాపాలను అటవీ ప్రాంతాలకే పరిమితం చేశారు.

మిడ్ మానేరుకు గోదావరి జలాలు

● శ్రీపాద ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతలు షురూ.. ● నంది పంప్ హౌస్‌కు 12,600 క్యూసెక్కుల నీటి తరలింపు
● ప్రభుత్వ ఆదేశాలతో మోటార్లు ఆన్ చేసిన అధికారులు ● ప్రవాహాన్ని బట్టి రోజుకు 2 టీఎంసీల తరలింపు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో వరద నీరు పెద్ద ఎత్తున వస్తుండడంతో ప్రభుత్వ ఆదేశాలతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను మిడ్ మానేరుకు ఎత్తిపోయడం ప్రారంభించారు. శనివారం మధ్యాహ్నం నంది మేడారంలో గల నంది పంప్‌హౌస్ ఒక మోటారును ఆన్ చేసి సాయంత్రం వరకు క్రమంగా నాలుగు మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఈసారి కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తి పోయకుండానే శ్రీపాద ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోస్తుండడం గమనార్హం. పెద్దపల్లి జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి శనివారం ఉదయం 14 వేల క్యూసెక్కులు, ఆ తర్వాత 13 వేలు, ఆ తర్వాత 16 వేలు, సాయంత్రం వరకు 12 వేల క్యూసెక్కులకు పెరుగుతూ, తగ్గుతూ వచ్చింది. మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రాజెక్టు నీటి మట్టం 17.396 టీఎంసీలకు చేరుకోవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటి పారుదల శాఖ అధికారులు ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్ నుంచి ధర్మారం మండలంలో గల నంది పంప్ హౌస్‌కు గ్రావిటీ ద్వారా నీటిని వదిలిపెట్టారు. అక్కడి నుంచి మొదట ఒక మోటారును ఆన్ చేసి క్రమంగా సాయంత్రం 5 గంటల వరకు నాలుగు మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని నంది మేడారం రిజర్వాయర్‌లో ఎత్తిపోశారు. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా అండర్ టన్నెల ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గాయత్రి పంప్‌హౌస్‌కు తరలిస్తున్నారు. అక్కడ నుంచి మోటార్ల ద్వారా వరద కాలువలో నీటి ఎత్తిపోయడంతో మిడ్ మానేరుకు వెళుతున్నాయి. నంది మేడారం పంప్‌హౌస్‌లో మొత్తం 7 మోటార్లు ఉన్నాయి. ఒక్కో మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తారు. మొత్తం మోటార్లు నడిస్తే 22,050 క్యూసెక్కుల నీళ్లు అంటే 2 టీఎంసీల నీటిని తరలించవచ్చు. రోజుకు రెండు టీఎంసీలను తరలించే విధంగా అండర్ టన్నెళ్లు, పంప్‌హౌస్‌లను నిర్మించారు. సాయంత్రం 6 గంటల వరకు ఎల్లంపల్లి ప్రాజెక్టుకు సాయంత్రం వరకు 12,931 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగి పోవడం, అన్నారం బ్యారేజీకి బుంగ పడడం, సుందిళ్ల బ్యారేజీకి స్వీపేజీ సమస్య ఉండడంతో వీటిని సందర్శించిన ఎన్‌డీఎస్‌ఏ బృందం మరమ్మతులు చేయాలని సూచించింది. వాటికి మరమ్మతులు జరుగుతుండగానే వర్షాలు మొదలయ్యాయి. దీంతో ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు మూడు బ్యారేజీల గేట్లు తెరిచి ఉంచాలని ప్రభుత్వానికి సూచించింది. దీంతో అక్కడి నుంచి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని ఎత్తిపోయడం లేదు. ఎల్లంపల్లి ఎగువ భాగాన కురుస్తున్న వర్షాలు, కడెం ప్రాజెక్టు నిండి తద్వారా వస్తున్న అదనపు జలాలతో వారం రోజుల్లో 13 టీఎంసీల నీళ్లు ప్రాజెక్టులోకి వచ్చాయి. ఈ నెల 18వ తేదీ వరకు ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి మట్టం 5.140 టీఎంసీలు కాగా, ఆ మరుసటి రోజు నుంచి కురుస్తున్న వర్షాలతో వరద పెరిగింది.

శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ (మిడ్ మానేరు) పూర్తి స్థాయి నీటి మట్టం 27 టీఎంసీలు కాగా, అందులో 6 టీఎంసీలు, లోయర్ మానేరు డ్యామ్ నీటి మట్టం 24 టీఎంసీలు కాగా, అందులో 6 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. క్యాచ్‌మెంట్ ఏరియాలో పెద్దగా వరద లేక పోగా, ఎస్సారెస్పీకి కూడా వరద లేదు. ఈ నేపథ్యంలో ఎల్లంపల్లికి వరద పెరిగిన తర్వాత మిడ్ మానేరుకు నీటిని తరలించాలని నాలుగు రోజుల క్రితమే ప్రభుత్వం ప్రాజెక్టు అధికారులకు సూచించింది. జూన్ మాసంలో పెద్దగా వర్షాలు పడక పోగా, జూలై ఆరంభంలో కూడా గడ్డు పరిస్థితులు ఉండడంతో, గత ఏడాది కాళేశ్వరం ప్రాజెక్టు మోటార్లను ఆన్ చేసి 8 నుంచి 9 టీఎంసీల నీటిని ఎల్లంపల్లిలోకి ఎత్తి పోశారు. ఇంతలో వరుసగా భారీ వర్షాలు పడడంతో గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలి పెట్టారు.

మిడ్ మానేరు, ఎల్‌ఎండీల పరిస్థితి దయనీయంగా ఉండడంతో గేట్లనుఎత్తకుండా ఎత్తిపోతలను ప్రారంభించారు. ఎల్లంపల్లికి పైనుంచి వస్తున్న వరద నీటిని వచ్చినట్లే తరలించాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు ఎప్పటికప్పుడు నీటి మట్టాలను అంచనా వేస్తూ ఎత్తిపోతలను కొనసాగిస్తున్నారు. పైనుంచి వరద పెరిగితే మాత్రం రోజుకు 2 టీఎంసీల నీటిని తరలించాలని అధికారులు నిర్ణయించారు.


నీటితో కళకళలాడుతున్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు


నంది మేడారం పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోస్తున్న నీరు

ధర్మపురి గోదావరి వద్ద పెరిగిన వరద

● కడెం నుంచి 6,670 క్యూసెక్కుల నీరు విడుదల


ధర్మపురి వద్ద గోదావరి నది ప్రవాహం

ధర్మపురి, జూలై 27: ధర్మపురి వద్ద గోదావరి నది నీటి ప్రవాహం శనివారం వేగంగా కొనసాగింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు నిండుతున్నాయి. దీనికి తోడు కడెం నుంచి 6,670 క్యూసెక్కుల నీరు గోదావరిలోకి విడుదల చేశారు. దీంతో ఆలయ స్నానఘట్టాల ముందు వరకు నీరు చేరింది. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా ఆలయ సిబ్బంది మైకుల ద్వారా ప్రచారం చేసి అప్రమత్తం చేశారు. నదీతీర ప్రాంతాలను ప్రజలను అప్రమత్తం చేశారు. రైతులు, కూలీలు జాగ్రత్తలు వహించాలని తహసీల్దార్ కృష్ణచైతన్య, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్ కుమార్, సిబ్బంది చర్యలు చేపట్టారు. రాయపట్నం వంతెన వద్ద ప్రజలను అప్రమత్తం చేశారు.

ఎస్సారెస్పీలోకి 35,078 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. శనివారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 35,078 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 31.035 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 66.508 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 605 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 24.766 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.354 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.


ఎస్సారెస్పీ ప్రాజెక్టు

ఎల్‌ఎండీలోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో

తిమ్మాపూర్, జూలై27: గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి స్వల్పంగా వరద నీరు చేరుతోంది. ఎల్‌ఎండీ పూర్తి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా శనివారం సాయంత్రం వరకు 5.330 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. మోయతుమ్మెద వాగు నుంచి 576 క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండిలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. గత సంవత్సరం ఇదే సమయంలో ఎల్‌ఎండిలో 20 టీఎంసీలకు పైన ఉండగా పైనుంచి మోయతుమ్మెద, ఎంఎంఆర్ నుంచి కలిపి సుమారు 19వేల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లోలు ఎల్‌ఎండిలోకి వస్తుండటంతో ఎల్‌ఎండి పూర్తి స్థాయిలో నిండుతుండగా అధికారులు 16గేట్లు ఎత్తి 56వేల క్యూసెక్కులకు పైగా దిగువకు గోదావరిలోని నీటిని విడుదల చేశారు. కానీ ప్రస్తుతం ఎల్‌ఎండీ పరిస్థితి దానికి భిన్నంగా ఉంది. వర్షాలు కురుస్తున్నప్పటికీ ఎగువన కుంటలు, వాగులు,చెరువులు మత్తడి దూకకపోవడంతో పాటు, పైనుంచి మోయతుమ్మెద వాగులోనికి వరద నీరు కూడా రాకపోవడంతో ఎల్‌ఎండీలోని నీటి ఇన్‌ఫ్లోలు చాలా స్వల్పంగా ఉన్నాయి.


ఎల్‌ఎండీ రిజర్వాయర్

తల్లీ చదువుకుంటావా..

● వ్యవసాయ పనులు చేస్తున్న బాలికతో కేంద్ర మంత్రి బండి సంజయ్ ● హాస్టల్‌లో చేర్పించి చదివిస్తానని హామీ


బాలికతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్


కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు విన్నవిస్తున్న కుటుంబం

గంగాధర, జూలై 27: గంగాధర మండలం చర్లపల్లి(ఆర్)లో ఎంఎన్ఆర్ఈజీఎస్‌లో 15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం కేంద్ర మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం తిరిగి వెళ్తుండగా గ్రామ శివారులో వ్యవసాయ కూలీల వద్దకు వెళ్లి మాట్లాడారు. ఓ బాలికను చూసి కేంద్ర సహాయ మంత్రి సంజయ్ ఎందుకు చదువుకోవడం లేదని ప్రశ్నించారు. కుటుంబ పరిస్థితిపై ఆరా తీశారు. దీంతో తన పేరు బోళ్ల అక్షయ అని టెన్త్ పాసైనప్పటికీ ఆర్థిక పరిస్థితులు బాగోలేక కూలీ పనులకు వెల్లుతున్నానని బదులిచ్చింది. చదువుకోవాలని ఉందని తెలపడంతో వెంటనే అక్కడే ఉన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డిని పిలిచి బాలిక వివరాలు తీసుకుని వెంటనే కాలేజీలో చదివించడంతో పాటు ఆసక్తి ఉంటే హాస్టల్‌లో చేర్పించాలని చెప్పారు. దీంతో బాలిక తండ్రి మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, రాష్ట్ర నాయకుడు మేకల ప్రభాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్‌కి వెళ్లిన తన భర్త ఆచూకీ తెలుపాలని వినతి

కరీంనగర్ క్రైం : జీవనోపాధి కోసం దుబాయ్‌కి వెళ్లిన తన భర్త ఆచూకీ తెలియక ఇబ్బందులు పడుతున్నామని, ఆచూకీ కనుక్కోవాలని శనివారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను బాధితులు కలిశారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గురుకులకొండాపూర్ గ్రామానికి చెందిన చొక్కల శ్రీధర్ 2022 జూలై 27న దుబాయికి వెళ్లి అక్కడ షార్జాలోని సరత్ కంపెనీలో పనిచేసేవాడు. కంపెనీలో తక్కువ జీతం, యాజమాన్యం పెట్టే ఇబ్బందులను తట్టుకోలేక 2023 సెప్టెంబరు 7న కంపెనీ నుంచి బయటకు వెళ్లాడు. శ్రీధర్ కుటుంబ సభ్యులు అప్పుచేసి 2023 అక్టోబరు22న విమానం టికెటన్ పంపించారు. కానీ శ్రీధర్ రాలేదు. అప్పటి నుంచి శ్రీధర్ ఆచూకీ లభించలేదు. శ్రీధర్‌కు రెండేళ్ల వయస్సు, ఏడాదిన్నర వయస్సున్న ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. శ్రీధర్ భార్య చొక్కల అఖిల తన ఇద్దరు కూతుళ్లతో, కుటుంబ సభ్యులు శనివారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే స్పందించిన కేంద్ర మంత్రి షార్జాలోని ఎంబసీ అధికారులకు మెయిల్ చేశారు. రెండు రోజులు సెలవులు ఉన్నందున సోమవారం వరకు వివరాలు వస్తాయని కేంద్ర మంత్రి చెప్పినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

మెట్‌పల్లి రూరల్, జూలై, 27: మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యాసాగర్‌ను శనివారం కలెక్టర్ సత్యప్రసాద్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల క్రితం పాఠశాలలోని విద్యార్థి రాజారపు గణాధిత్య మృతి చెందడంతో పాటు మరో ఇద్దరు విద్యార్థులు రాపర్తి హర్షవర్ధన్, అడేపు గణేష్ అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థుల పట్ల బాధ్యత రహితంగా వ్యవహరించారని, జరిగిన ఘటనపై విచారణ చేసి, ఆరోపణలు ఎదుర్కొంటున్న పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యల్లో భాగంగా కలెక్టర్ సస్పెండ్ చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని రైతు మృతి

ధర్మపురి, జూలై 27: ధర్మపురి మండలంలోని నేరెళ్ల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని గోవింద్‌పల్లెకు చెందిన కోల శంకర్ (40) అనే రైతు శనివారం సాయంత్రం మృతి చెందాడు. శంకర్ వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మమత, ఇద్దరు కొడుకుల ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రెండు ఆలయాల్లో చోరీ

ఎల్లారెడ్డిపేట, జూలై 27: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని పెద్దమ్మ, ఎల్లమ్మ ఆలయాల్లో దొంగలు శుక్రవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. ప్రధాన ద్వారం తాళాలు పగల కొట్టిన దొంగలు అమ్మవారి బంగారు పుస్తెలు, ముక్కు పుడక ఎత్తుకెళ్లారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సమస్యల వలయంలో పెద్దాపూర్ గురుకులం

● రెండు రోజుల క్రితం ఫిట్స్‌తో విద్యార్థి మృతి ● విషపురుగు కుట్టి మరో ఇద్దరికి అస్వస్థత ● ఇంటి దారి పట్టిన విద్యార్థులు

మెట్‌పల్లి రూరల్, జూలై, 21: మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ క్యాంపు బాలుర గురుకుల పాఠశాల సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. పాఠశాలలో సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు విద్యార్థులకు అందని ద్రాక్షగానే మారాయి. గురుకుల పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణానికి నిధులు కేటాయింపుల్లో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వెంటాడుతుండడంతో విద్యార్థులు పాత గదుల్లోనే దినదిన గండంగా చదువులు సాగించాల్సి పరిస్థితి నెలకొంది. పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో 546 మందికి పైగా విద్యార్థులు ఉన్నప్పటికీ వసతులతో కూడిన శాశ్వత భవనాలు కరువయ్యాయి. ఈ పాఠశాలలో 5 నుంచి 10వ తరగతితో పాటు ఇంటర్ కళాశాలను కూడా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 1970లో నిర్మించిన రేకుల షెడ్డులో కొనసాగిస్తున్నారు. కనీసం పాఠశాలలో కిటికీలు లేని గదుల్లోనే విద్యార్థులు చదువు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాకాలం, చలికాలం వచ్చిందంటే విద్యార్థులకు మరిన్ని కష్టాలు ఎదురవుతూనే ఉంటాయి. సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావును విద్యార్థులు అప్పట్లో విన్నవించగా 2016లో రూ. 4.25కోట్లు నిధులు మంజూరు చేయించగా 2018లో పనులు ప్రారంభించారు. భవనం మంజూరు అయినప్పటికీ సొసైటీ సంస్థ నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వం వల్ల భవన నిర్మాణ పనులు నత్తనడకగా చేపట్టారు. కనీసం పాఠశాల గదుల చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించక పోవడంతో పాములు విష పురుగులతో విద్యార్థులు భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పాఠశాల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలలో శుక్రవారం వేకువజామున విద్యార్థి రాజారపు గణాధిత్య ఫిట్స్‌తో మృతి చెందగా.. మరో ఇద్దరు విద్యార్థులు విష పురుగు కుట్టి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు సమాచారం అందించి వారిని మెట్‌పల్లి ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. వైద్యులు పరిక్షించి చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించారు. ఒకే రోజు విద్యార్థి మృతి చెందడం, మరో ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురైనా కూడా కనీసం చికిత్స అందిచడానికి స్టాఫ్ నర్సు లేకపోవడం గమనార్హం. విద్యార్థులు భయంతో ఇంటి దారి పడుతున్నారు. రాత్రివేళ ఏమైనా ఇబ్బందులకు గురైతే పట్టించుకోవడానికి వైద్య సిబ్బంది లేరని అందుకే ఇంటికి తీసుకెళ్తున్నామని తల్లిదండ్రులు తెలిపారు.


గురుకులం నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

గాయత్రి పంప్‌హౌస్ నుంచి నీటి విడుదల

● నాలుగు పంపుల ద్వారా మిడ్‌మానేరుకు 12,600 క్యూసెక్కుల నీరు


గాయత్రీ పంప్‌హౌస్ వద్ద కాంగ్రెస్ నాయకుల సంబరాలు

రామడుగు, జూలై 27: రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శనివారం సాయంత్రం అధికారులు నీటిని విడుదల చేశారు. మొదట ఒక బాహుబలి పంపు నుంచి నీటి విడుదల చేసిన అధికారులు రాత్రి వరకు నాలుగు పంపుల ద్వారా నీటి విడుదలను కొనసాగించారు. పంప్‌హౌస్ నుంచి నేరుగా బాహుబలి పంపుల ద్వారా గ్రావిటీ కాల్వకు విడుదలైన నీరు నేరుగా వరద కాలువ ద్వారా పరవల్లు తొక్కుతూ ముందుకు సాగింది. ఇక్కడ 7 బాహుబలి పంపులు ఉండగా ఒక్కో పంపు ద్వారా రోజుకు 3150 క్యూసెక్కుల నీరు తరలి తరలించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. అయితే ఇక్కడ నాలుగు పంపుల ద్వారా నీటిని విడుదల చేస్తుండగా 12,600 క్యూసెక్కుల నీరు తరలివెళ్తున్నది. వరద కాలువ ద్వారా నీరు రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులోకి వెళ్తుంది. వరద కాలువకు నీటిని విడుదల చేయడంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల పోటాపోటీ పూజలు

బీఆర్ఎస్ డిమాండ్ చేయడంతోనే నీటిని విడుదల చేశారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు గాయత్రీ పంప్‌హౌస్ వద్ద నీటిలో పసుపు కుంకుమ పూలు చల్లి పూజలు నిర్వహించారు. మరోవైపు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషి ఫలితంగానే నీటి విడుదల చేశారని హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు గాయత్రీ పంప్ హౌస్ వద్దకు పెద్ద ఎత్తున తరలివెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మిడ్ మానేరుకు చేరుకున్న ఎల్లంపల్లి జలాలు

బోయినపల్లి, జూలై 27: మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి జలాలు చేరుకున్నాయి. ఎల్లంపల్లి నుంచి నంది మేడారం గాయత్రి పంప్ హౌస్ ద్వారా నీటి ఎత్తిపోతలు శనివారం ప్రారంభం కావడంతో ప్రాజెక్టులోకి రాత్రి 9 గంటల వరకు 2500 క్యూసెక్కుల ప్రవాహం ఎల్లంపల్లి నుంచి వరద కాలువ ద్వారా వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 305.62 మీటర్లు ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.50 టీఎంసీలకు ప్రస్తుతం 5.90 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

పరీక్షల ఒత్తిడి తట్టుకోలేక మెడికో ఆత్మహత్య


కోమళ్ల శిరీష(ఫైల్)

కరీంనగర్ క్రైం, జూలై 27: పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేక కరీంనగర్ శివారులోని ఓ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కోమళ్ల శిరీష(20) అనే విద్యార్థిని శనివారం ఆత్మహత్య చేసుకుంది. కరీంనగర్ రెండో రాణా పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదులోని వివరాల ప్రకారం..మరో మూడు రోజుల్లో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం పరీక్షలు ఉండటంతో ఒత్తిడిని భరించలేక శిరీష ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. చదువు తన నుంచి కావటం లేదని తరచుగా బాధపడిన ఒక్కగానొక్క కూతురు శిరీషను తల్లిదండ్రులు ఓదార్చుతూ భవిష్యత్ బాగుంటుందని సర్దిచెప్పేవారు. శనివారం ఉదయం తోటి విద్యార్థులతో కలిసి కరీంనగర్ నుంచి బస్సులో ప్రతిమ వైద్య కళాశాలకు వెళ్లింది. అనంతరం శిరీష తరగతులు ముగిసిన తరువాత 3 గంటలకు స్నేహితులతో కలిసి కరీంనగర్‌లోని విద్యానగర్‌లో ఇంటికి చేరింది. శిరీష తల్లిదండ్రులు కూడా అదే కళాశాలలో ఉద్యోగం చేస్తున్నారు. సాయంత్రం విధులు ముగించుకుని అందరం కలిసి ఇంటికి వెళదామని తల్లిదండ్రులు శిరీషకు చెప్పినప్పటికీ వినకుండా ఇంటికి చేరుకుంది. వెంటనే తల్లి ఇంటికి చేరుకునే సరికి శిరీష ఉరికి వేళాడుతూ కనిపించింది. దీంతో వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించిందని వెల్లడించారు. పరీక్షల ఒత్తిడి తట్టుకోలేకనే తన కూతరు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

శంకరపట్నం, జూలై 27: కేశవపట్నం గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నవేణి లచ్చమ్మ (89) అనే వృద్ధురాలు అనారోగ్య సమస్యలు భరించలేక ఈ నెల 26న పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 26న సాయంత్రం మృతి చెందింది. మృతురాలి కుమారుడు చెన్నవేణి కొంరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

మానకొండూర్, జూలై 27 : కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని సదాశివపల్లికి చెందిన అదృశ్యమైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైనట్లు స్థానిక సీఐ సదన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సదాశివపల్లికి చెందిన గాలిపల్లి శంకర్(40) అనే వ్యక్తి పేయింటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 25న కూరగాయల కోసం కరీంనగర్‌కు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని తెలిపారు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా 26న తీగల వంతెన సమీపంలోని చెక్‌డ్యాం వద్ద శంకర్ దుస్తులు కనిపించడంతో అతని భార్యా లీల స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి గాలిస్తుండగా శనివారం చెక్‌డ్యాంలో మృత దేహం లభ్యమైనట్లు సీఐ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి విక్రయదారుడి రిమాండ్

మానకొండూర్, జూలై 27 : గంజాయిని విక్రయించేందుకు వెల్లుతుండగా వాహనాల వాహనాల తనిఖీలో పట్టుబడ్డ యువకుడిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామానికి చెందిన సంగ వినయ్ అనే యువకుడు 240 గ్రాముల గంజాయిని విక్రయించేందుకు ద్విచక్ర వాహనంపై కరీంనగర్‌కు బయలుదేరాడు. సదాశివపల్లి వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డాడు. అతని వద్ద ఉన్న 240 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కారు ఢీకొని తండ్రీకొడుకులకు గాయాలు

ఓదెల, జూలై 27 : మండలంలోని పొత్కపల్లి పెద్ద చెరువు మూల మలుపు వద్ద శనివారం కారు ఢీకొని పొత్కపల్లికి చెందిన దానవేని కుమార్, అతని కుమారుడు అర్జున్ సాయిలకు గాయాలయ్యాయి. పొత్కపల్లి నుంచి కుమార్ తన కుమారుడితో ద్విచక్ర వాహనంపై సుల్తాన్‌బాద్ వైపు వెళుతుండగా, మంచిర్యాలలో క్రషర్ నిర్వహించే వ్యక్తులు జమ్మికుంట వైపు వస్తున్న క్రమంలో పొత్కపల్లి పెద్ద చెరువు మూలమలుపు వద్ద వేగంగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో తండ్రికొడుకులిద్దరు పొలంలో ఎగిరిపడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, పొత్కపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని 108 వాహనం ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు.

కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, జూలై 27: ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌కు చెందిన అన గీత(35) కడుపునొప్పి భరించలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. అల్మాస్‌పూర్‌కు చెందిన గీతకు వివాహమైన ఐదేళ్లకు విడాకులయ్యాయి. ఏడాది క్రితం సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రాజక్కపేటకు చెందిన రాజుతో వివాహమైంది. అప్పటి నుంచి ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చూపించినా నయం కాలేదు. ఈ నెల 26న రాజు తన భార్య గీతను అల్మాస్‌పూర్‌లోని అత్తిగారింటికి తీసుకొచ్చి స్వగ్రామానికి వెళ్లిపోయాడు. ఓ వైపు సంతానం కలగకపోవడం, మరో వైపు తీవ్రమైన కడుపునొప్పి భరించలేక గీత మనస్తాపంతో శుక్రవారం ఇంట్లో ఉరేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో మాదకద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై ఎస్పీ అఖిల్‌మహాజన్‌తో కలిసి సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కొటిక్ కంట్రోల్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదకద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, విస్తృత ప్రచారంపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. మాదకద్రవ్యాలు సరఫరా చేసే వారిపై అత్యంత కఠినంగా వ్యవహరించాలన్నారు. యువత డ్రగ్స్‌కు అకర్షితులైతే దేశ భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. మాదకద్రవ్యాల రవాణా, సాగు, వినియోగంపై పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. మాదకద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించాలని, అవసరమైన చికిత్స, కౌన్సెలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అటవీ శాఖ అధికారులు అటవీ భూములను పరిశీలించాలని, గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. జిల్లాలోని ఆసుపత్రులు, మెడికల్ షాపులలో స్టాక్ వివరాలను తనిఖీ చేయాలన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రతీ మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయి నార్కొటిక్, కంట్రోల్ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు చెప్పారు. గంజాయిని అరికట్టేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని, కలిగే నష్టాలపై ప్రచారం చేస్తున్నామని అన్నారు. జిల్లాలో గంజాయి పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన కిట్లు అందుబాటులో ఉన్నాయని, డ్రంకెన్ డ్రైవ్ తరహాలో గంజాయి కిట్లతో తనిఖీలు చేస్తున్నామన్నారు. గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దే కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాల కోరారు. ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ అర్డీవోలు రమేష్, రాజేశ్వర్, డీఎఫ్‌వో బాలమణి, డీఈవో రమేష్, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వసంతరావు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ భవాని పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం వర్ధంతి



కలాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

ఇల్లంతకుంట, జూలై 27: భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని మండలంలోని వల్లంపట్ల కేరళమాడల్ స్కూల్ ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీరాముల శ్రీధర్ మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనలో అబ్దుల్ కలాం చేసిన సేవలు ఘనమైనవన్నారు. కలలు కనండి వాటిని సాధించండి అని చెప్పిన కలాం ఆశయాల సాధనకు పాటుపడాలని విద్యార్థులకు సూచించారు.

కోనరావుపేట ఎంపీడీవోగా శ్రీనివాస మూర్తి

కోనరావుపేట, జూలై 27 : కోనరావుపేట ఎంపీడీవోగా శ్రీనివాస్ మూర్తితో పాటు ఎంపీవోగా హరి శనివారం బాధ్యతలు చేపట్టారు. కోనరావుపేట మండల ఎంపీడీవోగా పనిచేసిన శశికళ ఇల్లంతకుంట మండలానికి బదిలీ అయ్యారు. ఇల్లంతకుంటలో పనిచేసిన శ్రీనివాసమూర్తి, ఎంపీవో హరి కోనరావుపేటకు బదిలీ చేయగా బాధ్యతలు చేపట్టారు.

విద్యార్థులు సాహితీ రంగంలో రాణించాలి

ఎల్లారెడ్డిపేట, జూలై 27: విద్యార్థులు చదువుతోపాటు సాహితీ రంగంలో రాణించాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండం కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పత్తిపాక ఫౌండేషన్, గారిపల్లి ట్రస్టు ఆధ్వర్యంలో చేపట్టిన 'పిల్లల సృజనాత్మకత రచన శిల్పశాల'కు సంబంధించిన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలన్నారు. సమాజంలోని పలు అంశాలను పరిగణనలోకి తీసుకొని రచనలు చేయాలన్నారు. విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లేఖ రచన, తెలుగు కథలు, కవిత్వం, చిత్రలేఖనం వంటి అంశాలపై కార్యశాలను నిర్వహించనున్నామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు పర్శరాములు, చంద్రమౌళి, విష్ణుప్రసాద్, సాగర్, భూమక్క, కవిత, గీత, ప్రవళిక పాల్గొన్నారు.

విద్యార్థులకు ఈకో క్లబ్‌పై అవగాహన

వీర్నపల్లి, జూలై 27 : ప్రభుత్వ పాఠశాలలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా విద్యార్థుల్లో వినోదం విజ్ఞానం పెంచే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ అన్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈకో క్లబ్‌పై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఆరోగ్యకరమైన సమతుల ఆహారం తీసుకునేలా తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రేమ్ సాగర్, మంజుల పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల టౌన్, జూలై 28: గురుకుల పాఠశాలలో విద్యార్థి మరణంపై విచారణ జరిపి అధికారులపై చర్యలు తీసుకోవాలని టీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం సిరిసిల్ల పట్టణం బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండు రోజుల క్రితం పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో రాజారపు గుణాదిత్య అర్ధరాత్రి అస్వస్థతకు గురవడంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా మరణించాడని, మరో ఇద్దరు విద్యార్థులు హర్షవర్ధన్, గణేష్ అస్వస్థతకు గురికాగా వైద్యులు పాముకాటు వల్లే జరిగిందని చెప్పారన్నారు. గుణాదిత్య కూడా పాముకాటుతోనే మరణించాడని తల్లిదండ్రులు చెపుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులు నేలపైన పడుకోవడంతో ఈ సంఘటన చోటు చేసుకుందని, దీనికి ప్రభుత్వం, అధికారులు బాధ్యులని ఆరోపించారు. హాస్టల్ విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. నాయకులు మట్టె శ్రీనివాస్, నవీన్, వెంకటేష్, సుజిత్, రోహిత్, హర్షిత్, అరవింద్, తిరుపతి పాల్గొన్నారు.

రెండు పేర్లతో కొనసాగుతున్న ప్రైవేటు పాఠశాల

సిరిసిల్ల రూరల్, జూలై 27 : సిరిసిల్ల పట్టణంలో రెండు పేర్లతో కొనసాగుతున్నప్రైవేటు పాఠశాలను విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ఏబీవీపీ విభాగ్ లా ఫోరం కన్వీనర్ సామనపెల్లి ప్రశాంత్ అన్నారు. పట్టణంలో ప్రగతిలో ఉన్న ప్రైవేటు పాఠశాలకు ఒక పక్కన శ్రీసరస్వతి, మరో పక్కన ప్రగతి స్కూల్ పేరుతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారని, వసతులు లేకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించని పక్షంలో డీఈవో కార్యాలయం ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

గంభీరావుపేట, జూలై 27 : గంభీరావుపేట మండలం గోరంటాలలో రెండు కుటుంబాలకు చెందిన లక్ష్మి, మంజుల చికిత్స కోసం మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను నాయకులు శనివారం పంపిణీ చేశారు. రూ.60 వేల చొప్పున మంజూరైనట్లు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, నాయకులు నాగభూషనం, భూమరాజం, బాస్కర్‌నాయక్ ఉన్నారు.

అనుమతులు లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

వేములవాడ టౌన్, జూలై 27:వేములవాడ పట్టణంలోని అనుమతి లేని ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ నాయకుడు పోతు అనిల్ అన్నారు. వేములవాడ పట్టణంలో శనివారం ఏంఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలలను ఏర్పాటు చేసి డబ్బులు దండుకుంటున్నారన్నారు. ప్రతీ పాఠశాలలో ఫీజ్ బోరు ఏర్పాటు చేసేల చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు దిలీప్, కారేష్, సందీప్, ప్రమోద్, వేణు ఉన్నారు.

రహదారిపై వరినాట్లు వేసి నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న యువకులు

కోనరావుపేట, జూలై 27 : కోనరావుపేట మండలం మంగళపల్లి గ్రామంలోని అంతర్గత రహదారులు చెరువులను తలపించేలా నీరు నిలవడంతో వరి నాట్లు వేసి యువకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ మంగళపల్లి గ్రామంలో కురుస్తున్న చిన్నపాటి వర్షాలకే రోడ్లమీద నీరు నిలుస్తోందని, బురద మయంగా మారి నడవలేని పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. అధికారులు స్పందించి రోడ్లపై నీరు నిలవకుండా మరమ్మతు చేపట్టాలని కోరారు. యువకులు ఊరడి మధు, ఉప్పుల శ్రీకాంత్, కొమిరెడ్డి జలంధర్, శాసన రాకేష్, శ్రీనివాస్, ఉప్పుల రాకేష్, జలంధర్, వినయ్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ ఊసే లేదు

రుద్రంగి జూలై 27: పార్లమెంట్‌లో ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ ఊసే లేదని డీసీసీ కార్యదర్శులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, చెలుకల తిరుపతి, తర్రె లింగం అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు నిధులిచ్చి తెలంగాణకు అన్యాయం చేయడమేంటని ప్రశ్నించారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఏం చేస్తున్నారన్నారు. తక్షణమే బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలని, తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని అన్నారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణ హామీలు అమలు చేయడంతో పాటు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం వెంటనే ప్రకటించాలని, మోదీ ప్రభుత్వంపై చంద్రబాబు, నితీష్ కుమార్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు గండి నారాయణ, అల్లూరి సంతోష్ రెడ్డి, స్వర్గం పరంధాములు, పడాల శ్రీనివాస్, దయ్యాల శ్రీనివాస్, అంబటి శ్రీధర్, బోయిని నర్సయ్య, సుమంతు రాజారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



దీక్షలో కూర్చున్న కార్మికులు

సిరిసిల్ల రూరల్, జూలై 27 : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల సంక్షోభ నివారణకు చేపట్టిన రిలేనిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వస్త్రపరిశ్రమల అనుబంధ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శనివారానికి ఆరో రోజుకు చేరుకున్నాయి. పాలిస్టర్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఉడుత రవి, జిందం మహేష్, మరిపెద్ది ప్రభాకర్, జిందం రవి, చందుపట్ల పోచమల్లు, బచ్చు రామచంద్రం, మంగళరపు లక్ష్మీరాజం, జిందం దేవదాసు కూర్చోగా పాలిస్టర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దూడం రమేష్ సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో వస్త్ర పరిశ్రమలకు చెందిన యాజమానులు, ఆసాములు, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు చలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం వస్త్ర పరిశ్రమలకు ఉపాధిని ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలకు సంక్షోభాన్ని నివారించాలని కోరారు.

వర్షానికి కూలిన ఇల్లు



రామన్నపేటలో కూలిన ఇల్లు

చందుర్తి, జూలై 27: చందుర్తి మండలంలో కురుస్తున్న వర్షాలకు రామన్నపేట గ్రామంలో ఇల్లు కూలిపోయింది. శనివారం గ్రామానికి చెందిన భీమారాజు శంకరయ్యకు చెందిన ఇల్లు వర్షంతో తడిసి కూలిపోయింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచులు దుమ్మ అంజయ్య, భీమరాజు కళ్యాణి కనకరాజు కోరారు.

విద్యారంగానికి అన్యాయం

సిరిసిల్ల టౌన్, జూలై 28 : ప్రజా ప్రభుత్వంలో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని టీఎస్‌ఎస్‌ఎఫ్ కరీంనగర్ పార్లమెంట్ అధ్యక్షుడు మోతె రాజిరెడ్డి అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ శాసన సభ సమావేశంలో రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం విద్యారంగానికి కేవలం ఏడు శాతం నిధులను కేటాయించడం తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. గతంలో విద్యారంగానికి 15 శాతం నిధులను కేటాయిస్తామని ఇచ్చిన హామీని విస్మరించిందని మండిపడ్డారు. తెలంగాణలోని ప్రతీ యూనివర్సిటీకి రూ.500 కోట్లు కేటాయించాల్సిన ప్రభుత్వం అన్ని యూనివర్సిటీలకు కలిపి రూ.500 కోట్లు నిధులను కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య రంగానికి రూ.11,500 కోట్ల కేటాయింపు సిగ్గు చేటన్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌ల పెంపు ఊసేలేదన్నారు. పేద విద్యార్థులకు ఎలక్ట్రికల్ స్కూటీలు ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.8వేల కోట్ల ఫీజు బకాయిలు ఉండగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు బకాయిల చెల్లింపుల ఊసెత్తలేదన్నారు. ప్రభుత్వం మేలుకొని విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీఎస్‌ఎస్‌ఎఫ్ నాయకులు అరె మల్లేశం, తుమ్మన్నపెల్లి సత్యం, శ్యాగ్రప్రశాంత్ పాల్గొన్నారు.

మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని విస్మరించిన అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 27: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించడం లేదని కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ రాలేదంటూ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెలలో మూడు సార్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారులు సమావేశం ఉందంటూ షెడ్యూల్ పంపారన్నారు. వచ్చిన ప్రతిసారీ కలెక్టర్ లేరంటూ సమావేశాన్ని వాయిదా వేశారన్నారు. ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ అట్రాసిటీ కమిటీ సభ్యుడు సుధాకర్, అశోక్, దేవానంద్, బాలయ్య, అలువాల ఈశ్వర్, బాలరాజు, లకావత్ తిరుపతి నాయక్, అజ్మీరా తిరుపతి నాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణులకు అండగా ఉంటాం

గంభీరావుపేట, జూలై 27: కాంగ్రెస్ శ్రేణులకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని సిరిసిల్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంతోపాటు దమ్మన్నపేట, గోరంటాలలో మృతుల కుటుంబాలను శనివారం పరామర్శించారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోట లింగం తల్లి రాజవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దమ్మన్నపేటలో మల్లయ్య, గోరంటాలలో తిరుపతి అనే కాంగ్రెస్ నాయకులు ఇటీవల మరణించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, నాయకులు గౌరీ శంకర్, ఎర్ర నర్సయ్య, జంగం రాజులు, అక్కపల్లి బాలయ్య, బంగ్ల రాజు, మల్లయ్య యాదుల్లా, నాంపెల్లి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 27 : ప్రభుత్వ పాఠశాలలతోపాటు, కేజీబీవీల్లో సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మరవేణి రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శనివారం ఏబీవీపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కల్పించాలని, స్వీపర్లు లేక మురికి వాసనతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కేజీబీవీల్లో కనీస వసతులు లేక నాణ్యమైన అహారం అందడం లేదన్నారు. భోజనంలో నాణ్యత లేక తినలేక పోతున్నారన్నారు. చలికాలంలో గీజర్లు లేక విద్యార్థులు చన్నీటితోనే స్నానాలు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై విద్యాశాఖ అధికారులు దృష్టిసారించాలని అన్నారు. జిల్లాలో ఉపాధ్యాయుల కొరత తీర్చాచడంతోపాటు తరగతి గదులు లేక చెట్ల కింద చదువుకునే దుస్థితి అనేక పాఠశాలలో ఉందన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఏబీవీపీ లాఫోరమ్ విభాగ్ కన్వీనర్ సమానపల్లి ప్రశాంత్, ఏబీవీపీ వింగ్ జిల్లా కన్వీనర్ లోపెల్లరాజురావు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థానాల్లో అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ రాజగోపాల్

వేములవాడ టౌన్, జూలై 27: వేములవాడ మండలం అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత స్థాయిలో రాణిస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజగోపాల్ అన్నారు. కళాశాలలో శనివారం అలుమ్ని టాక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత రైల్వేలో చీఫ్ విజిలెన్స్ అధికారిగా పని చేస్తున్న ఎలక్ట్రికల్ విభాగం పూర్వ విద్యార్థి గాజుల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థులు ఉపాధి పొందిన తీరును ప్రస్తుత విద్యార్థులతో పంచుకునేందుకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఎలక్ట్రికల్ పూర్వ విద్యార్థి గాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ లేకుండా ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ ఇంజనీరింగ్‌ను ఊహించుకోలేమన్నారు. దేశాభివృద్ధిలో కోర్ ఇంజనీరింగ్ బ్రాంచీలు సివిల్, మెకానిక్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్ల పాత్రను వివరించారు. ప్రాక్టికల్ విజ్ఞానాన్ని, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. భారత రైల్వేలో ఎలక్ట్రికల్ డిప్లొమా విద్యార్థులకు జూనియర్ ఇంజనీర్‌గా లోకో పైలెట్‌గా పలు అవకాశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ శాఖాధిపతి రవీందర్, ఉపన్యాసకులు హిమజ, హసీనాబేగం, నర్మద విద్యార్థులు ఉన్నారు.

బురదమయమైన ప్రభుత్వాస్పత్రి ఆవరణ



చిత్తడిగా మారిన ఆస్పత్రి ఆవరణ

ఎల్లారెడ్డిపేట, జూలై 27: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణ ఇటీవల కురుస్తున్న వర్షాలకు బురదమయంగా మారింది. ఆస్పత్రి భవనం వెనుక భాగంలో వరద నీరు వచ్చి చేరింది. ఆవరణం అతా బురదతో నిండిపోయింది. రోగులు నడిచేందుకు అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రి ముందు భాగం శుభ్రంగా కనిపించిపా వెనుక మాత్రం బురదతో నిండిపోయింది. నిల్వ చేరిన నీటితో దోమలు వృద్ధి చెందుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాధులు తగ్గుతాయని ఆస్పత్రికి వెళ్తే కొత్త రోగాలు వచ్చే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని, సమస్యను పరిష్కరించాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

● చెరువులు, కుంటలకు జలకళ



మూడపల్లిలో మత్తడి దూకుతున్న ఊర చెరువు

చందుర్తి,జులై 27: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకుంటున్నాయి. జిల్లాలోని చందుర్తి మండలంలోని రామన్నపేటలో లొడి చెరువు, మూడపల్లిలో ఊర చెరువుతోపాటు తదితర గ్రామాల్లో చెరువులు, కుంటలు మత్తడి దూకుతున్నాయి. శనివారం ఉదయం నుంచి చందుర్తి మండలంలో ముసురుతో కూడిన వర్షం పడింది.

షాప్ తాళం పగలగొట్టేందుకు యత్నం

- సీసీ కెమెరా చూసి జారుకున్న మహిళ

వేములవాడ టౌన్, జూలై 27: అర్ధరాత్రి సమయంలో షాపు తాళం పగలగొట్టేందుకు యత్నించి ఓ మహిళ సీసీ కెమెరాను చూసి అక్కడ నుంచి జారుకుంది. వేములవాడ పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వేములవాడ రాజన్న ఆలయ ప్రధాన రోడ్డులోని సెల్‌పాయింట్ షెట్టర్ తాళాన్ని ఓ అగంతకురాలు పగలగొట్టేందుకు యత్నించింది. సెల్‌పాయింట్ తాళం ఎంతకొట్టిన పగలక పోవడంతో పక్కనే ఉన్న మరో షాపు పగలగొట్టేందుకు విఫలయత్నం చేసింది. మరో మారు ఎవరైనా వస్తున్నారేమోనని చుట్టు పక్కల పరిశీలిస్తుండగా సీసీ కెమెరాను చూసింది. వెంటనే అక్కడి నుంచి జారుకుంది. శనివారం ఉదయం షాపు తెరిచిన యజమాని అనుమానం రావడంతో సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించాడు. అందులో సదరు మహిళ చేసిన ఘనకార్యం రికార్డయ్యింది. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తంగళ్లపల్లి, జూలై 27: కర్నాటకలోని బెంగళూరు శివారులో శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తంగళ్లపల్లి మండలం మండపల్లి కేసీఆర్ నగర్‌కు చెందిన ఖాజా పాషా(50) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కూలిగా పనిచేస్తున్న ఖాజా పాషా సిరిసిల్ల నుంచి వినాయక విగ్రహాలను వాహనంలో లోడ్ చేసుకొని బెంగళూరుకు వెళ్లాడు. ఈ క్రమంలో అక్కడ రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

పదేళ్లుగా తొలగని ముసుగు

కోనరావుపేట, జులై 27 : కోనరావుపేట మండలం సుద్దాలలో పదేళ్ల క్రితం గ్రామపంచాయతీ సమీపంలోని చెరువు కట్టపై ఏర్పాటు చేసిన ఛత్రపతి సాహూ మహారాజ్ విగ్రహం ఆవిష్కరించడం లేదు. మహనీయుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ముసుగు తీయకుండా అవమాన పరుస్తున్నారని, వెంటనే విగ్రహాన్ని ఆవిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్సై అంజనయులకు భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్ ఫిర్యాదు చేశాడు.

పాఠశాలల్లో బోనాల సంబరాలు



సిరిసిల్లలో బోనాల సంబరాల్లో విద్యార్థుల ప్రదర్శన

సిరిసిల్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ బోనాల సంబరాలను విద్యార్థులు వైభవంగా నిర్వహించారు. శనివారం సిరిసిల్లలోని వెంకట్రావునగర్ విజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థులు పోతరాజులు, పులి వేషధారణలో ఆకట్టుకున్నారు. డప్పు చప్పుళ్ల మధ్య బోనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు ఎస్.గణేష్, కె .సురేందర్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని పలు గ్రామాల పాఠశాలల్లో ఆషాఢ మాసం సందర్భంగా విద్యార్థులు బోనాలు తీశారు. కందికట్కూర్, జంగమరెడ్డిపల్లె ప్రభుత్వ పాఠశాలలు, పొత్తూర్‌లోని వివేకానంద పాఠశాలల విద్యార్థులు బోనాలతో పోచమ్మ ఆలయాలకు చేరుకొని నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాలల ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, కరస్పాండెంట్ పండరీనాథ్, డైరెక్టర్ మధూకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో పాటు రాచర్ల బొప్పాపూర్ గొల్లపల్లి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినిలు భక్తిశ్రద్ధల నడుమ బోనాలను అలంకరించారు. విద్యార్థులు పోతరాజుల వేషాధారణలో ఆకట్టుకున్నారు. బోనమెత్తి డప్పు చప్పుల నడుమ వేడుకలను జరిపించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం కేంద్రంలోని సరస్వతీ శుభోదయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు బోనాలతో ఆలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. విద్యార్థుల పోతరాజుల వేషధారణ ఆకట్టుకుంది. కరస్పాండెంట్ శ్రీనివాస్ యాదవ్, ప్రిన్సిపాల్ మాధవి లతారెడ్డి ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి పద్మశ్రీ, సరిత, కీర్తన, వాణి, సందీప్, శ్రీనివాస్, ప్రణయ్ సౌమ్య, సౌజన్య, స్వరూప, ప్రసన్న పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం మర్తన్‌పేట మార్గదర్శి పాఠశాలలో శనివారం బోనాల పండుగను నిర్వహించారు. విద్యార్థులు బోనాలు నెత్తిన పెట్టుకొని ఆలయానికి తరలివెళ్లారు. విద్యార్థులు దుర్గామాత, కాళికాదేవి వేషధారణలో ఆకట్టుకున్నారు కరస్పాండెంట్ చిరంజీవి పాల్గొన్నారు.

చందుర్తి : మండలంలోని మల్యాలలోని సాధన ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు శనివారం బోనాల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్కూల్ కరస్పాండెంట్ చెన్నమనేని రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు మమత, సోని, శిరిష, నిత్య, మానస, శోభ, ఆదిత్య, విద్యార్థులు పాల్గొన్నారు.



పొత్తూర్‌లో బోనాలు తీస్తున్న విద్యార్థులు